క్లుప్తంగా

జవాన్ కుటుంబానికి బీఎస్ఎఫ్ ఆర్థిక సహాయం



దివంగత జవాన్ ప్రసాద్ కుటుంబానికి ఆర్థికసహాయం అందిస్తున్న హెచ్‌సీ ఆర్ శ్రీనివాసరావు

సీతానగరం: అనారోగ్యంతో మృతిచెందిన మండలంలోని చినభోగిలి గ్రామానికి చెందిన బీఎస్ఎఫ్ జవాన్ నగర ప్రసాద్ కుటుంబానికి తెలుగు రాష్ట్రాల్లో బీఎస్ఎఫ్ అసోసియేషన్ తరఫున ఆర్థిక సహాయాన్ని గురువారం అందించారు. గుజరాత్ సరిహద్దు ప్రాంతంలో గాంధీదామ్ 74 బెటాలియన్ కమాండెంట్ సంజయ్ అవినాష్, కేఎల్ వర్మల ఆర్థిక సహాయం రూ 1 లక్షా, 8వేలను దివంగత ప్రసాద్ భార్య పవిత్రకు హెచ్‌సీ రెడ్డి శ్రీనివాసరావు అందజేశారు. అలాగే బీఎస్ఎఫ్ అసోసియేషన్ నుంచి పవిత్రకు రూ.6,000, ప్రసాద్ తల్లిగంగమ్మకు రూ.18,000లు హెచ్‌సీ శ్రీనివాసరావు అందజేశారు. కార్యక్రమంలో ప్రసాద్ కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహ స్వామికి ప్రత్యేక పూజలు



వివిధ రకాల పుష్పాలంకరణలో లక్ష్మీ నృసింహస్వామి

సీతానగరం: మండల కేంద్రంలోని సువర్ణముఖి నదీ తీరాన వేంచేసిన వేణుగోలస్వామి ఆలయప్రాంగణంలో కొలువుదీరిన లక్ష్మీనృసింహ స్వామి ప్రత్యేక అంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారికి ప్రీతికరమైన గురువారం తెల్లవారుజామున ఆలయప్రధాన అర్చకుడు పీసపాటి శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అర్చకులు స్వామిని వివిధ రకాలపూలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం ఉదయం 6 గంటలనుంచి క్యూలోఉన్న భక్తులతో అర్చకులు ప్రత్యేక పూజలు చేయించారు. దూర ప్రాంతాలనుంచి వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

విద్యార్థులకు స్టడీమెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ప్రిన్సిపాల్ జె.రామారావు

పార్వతీపురంటౌన్: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అధ్యాపకుడు తెర్లి రవికుమార్ సమకూర్చిన స్టడీ మెటీరియల్‌ను ప్రిన్సిపాల్ జె. రామారావు గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు సులభమైన రీతిలో అర్థమయ్యేలా ప్రచురించిన పుస్తకాలను పంపిణీ చేశారని తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు తాతబాబు, శ్రీనివాసరావు, తేజ, తవిటినాయుడు పాల్గొన్నారు.

రేపటిలోగా దరఖాస్తులు సమర్పించాలి

సాలూరు: జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన చేస్తున్న అధ్యాపకులు రెన్యువల్ కోసం దరఖాస్తులు సమర్పించాలని జిల్లా ఐడీ కళాశాల, సాలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. శ్రీనివాసమూర్తి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022 - 23 విద్యాసంవత్సరంలో మార్చి 31, 2023 నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని పేర్కొన్నారు. దరఖాస్తులను శనివారం సాయంత్రం 5 గంటల్లోపు సంబంధిత కళాశాలల్లో సమర్పించాలని సూచించారు. జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహించి రెన్యువల్స్ చేస్తామన్నారు. 24న అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

భవన నిర్మాణ పనుల పరిశీలన

మక్కువ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో నాడు - నేడు నిధులతో జరుగుతున్న అదనపు తరగతి భవన నిర్మాణ పనులను ఎంఈఓ సత్యనారాయణ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యారంగానికి పెద్దపీట వేస్తోందన్నారు. ఇందులో భాగంగా విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు పాఠశాలలు, కళాశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. విద్యార్థులు శ్రద్ధతో చదువుకుని ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు.

తల్లీపిల్లల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ

- గర్భిణులు, బాలింతలకు ఇంటికే పౌష్టికాహారం
- ప్రతి నెలా క్రమం తప్పకుండా తనిఖీలు
- బాలింతల ఖాతాల్లో రూ.5 వేలు జమ



జిల్లా ఆస్పత్రిలో ప్రసూతి విభాగం

పార్వతీపురంటౌన్: రాష్ట్రప్రభుత్వం మహిళల ప్రసవాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం విదితమే. ఈ మేరకు మహిళ గర్భం దాల్చిన నుంచి ప్రసవించేంత వరకు ప్రభుత్వం అన్ని విధాలా వారికి అండగా ఉంటోంది. గర్భం దాల్చిన నాటి నుంచి అంగన్వాడీ కేంద్రం ద్వారా నేరుగా ఇంటికే పౌష్టికాహారాన్ని అందజేస్తోంది. ఆస్పత్రిలో ప్రసవానికి చేరినప్పటినుంచి ప్రసవించే వరకు సకల సౌకర్యాలు అందజేస్తోంది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోప్రసవం నిమిత్తం ఆస్పత్రుల్లో చేరే మహిళలకు ప్రసవం అనంతరం కేవలం రూ.1500లను, రూ.250లు విలువచేసే బేబీ కిట్లను మాత్రమే అందించేవారు. రూ.1500 కూడా రెండు, మూడు దఫాల్లో రెండు నెలల కాల వ్యవధిలో చెల్లించేవారు. ఇచ్చిన బేబీ కిట్లు నాణ్యత లేకపోవడంతో ఎవరూ సరిగా ఉపయోగించేవారు కాదు. నాణ్యత లేని బేబీ కిట్లు ఎవరూ ఉపయోగించడం లేదన్న జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత విషయాన్ని తెలుసుకుని బేబీకిట్లను కొనుక్కోవడానికి కావాల్సిన మొత్తాన్ని నేరుగా గర్భిణుల ఖాతాల్లో కలిపి రూ.5వేలు ప్రసవం మరుసటి రోజే జమచేస్తోంది.

ఇళ్ల వద్దకే పౌష్టికాహారం

ప్రభుత్వం మాతాశిశు సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, పాలు, గుడ్లు, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద మధ్యాహ్న భోజనం, వైఎస్సార్ కిట్లు, గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత నివారణకు వైద్య సేవలందిస్తోంది. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు ఆకుకూరలు, కూరగాయలతో నాణ్యమైన భోజనం అందిజేస్తోంది. ఇంటి నుంచి గర్భిణులు బయటకు రాలేని పరిస్థితిని గమనించిన ప్రభుత్వం, జూలై 1 నుంచి గర్భిణుల ఇళ్ల వద్దకే పౌష్టికాహారాన్ని అందిస్తూ రక్తహీనత నివారణకు చర్యలు చేపట్టింది.

జిల్లా ఆస్పత్రిలో ప్రసవాల వివరాలు

నెల	ప్రసవాల సంఖ్య
జనవరి	363
ఫిబ్రవరి	390
మార్చి	342
ఏప్రిల్	382
మే	349
జూన్	386
జూలై	374

గతంలో రూ.1500లు ఇచ్చేవారు



మూడేళ్ల క్రితం బేబీ కిట్లను ఆస్పత్రిలో అందజేసేవారు. వాటిలో నాణ్యత సరిగ్గా లేకపోవడంతో ఎవరూ సరిగ్గా వినియోగించుకునే వారు కాదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశాం. గతంలో కేవలం ప్రసవం అనంతరం రూ.1500లు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు బేబీ కిట్లు కొనుక్కోవడానికి నగదుతో కలిపి ప్రసవం అనంతరం రూ. 5వేలు నేరుగా బాలింత ఖాతాలో జమ చేస్తున్నాం.

– డా. బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం

యాంత్రీకరణ విధానంలో వరినాట్లు

- ఏఓ ఎస్.అవినాష్



పొలంబడి నిర్వహిస్తున్న ఏఓ ఎస్.అవినాష్, రైతులు

సీతానగరం: ఖరీఫ్ వరిసాగులో యాంత్రీకరణ విధానంతో వరినాట్లు వేయడం వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలున్నాయని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. ఈ మేరకు మండలంలో యాంత్రీకరణ (మిషన్ ప్లాంటేషన్)విధానంతో వరినాట్లు వేయించిన కె.వెంకటాపురం రైతు ఎల్ఎస్ సుబ్రహ్మణ్యం పొలంలో గురువారం డా. వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాంత్రీకరణ పద్ధతిలో వరినారును ముందుగా ట్రేలలో పెంచుకుని 15–20 రోజుల వయస్సు కలిగిన నారును యంత్రంతో ఊడుస్తారని చెప్పారు. ట్రేలలో నారు ఉత్పత్తి చేయడానికి ఎకరాకు 12 కేజీల విత్తనం సరిపోతుందని చెప్పారు. యాంత్రీకరణ ద్వారా నాట్లు వేయడం వల్ల రైతుకు ఉడుపు ఖర్చు సాధారణ పద్ధతిలో కంటే ఈ పద్ధతిలో ఎకరాకు రూ.1800 వరకు ఆదా అవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి, పొలంబడి రైతులు, గ్రామపెద్దలు, ఇతర రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

అమ్మఒడి లబ్ధిదారుల ఈకేవైసీ వేగవంతం



మాట్లాడుతున్న ఈఓపీఆర్డీ కె. కుమారవర్మ

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న అమ్మ ఒడి పథకం ద్వారా లబ్దిపొందనున్న పిల్లల తల్లులకు సంబంధించిన ఈకేవైసీ నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలని ఈఓపీఆర్డీ కె.కుమార వర్మ కోరారు. ఈ మేరకు మండలంలోని బళ్లకృష్ణాపురం, బగ్గందొరవలస, గెడ్డలుప్పి సచివాలయాల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను గురువారం పరిశీలించారు. అనంతరం గెడ్డలుప్పి సచివాలయంలో సర్పంచ్ ఎ. తిరుపతిరావు ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ, అమ్మ ఒడి ఈకేవైసీ తదితర అంశాలపై సచివాలయ ఉద్యోగులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో వర్షాలు కురవడంవల్ల ఇళ్లలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని, దోమల నివారణకు సర్పంచ్‌ల సమక్షంలో పంచాయతీ కార్యదర్శులు దోమల నివారణ మందు పిచికారీ చేయాలని కోరామని తెలిపారు. గెడ్డలుప్పిలో నిర్మాణంలో ఉన్న సచివాలయం, రైతుభరోసా భవనం నిర్మాణాలను పరిశీలించారు. డిజిటల్, పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ సహాయకులు అమ్మ ఒడి లబ్దిదారులకు నిర్దేశించిన గడువులోగా విధిగా ఈకేవైసీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కె. సత్యనారాయణ, ఉపసర్పంచ్, సచివాలయ కన్వీనర్లు, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ప్రతి ఇంటా పథకాల పంట



లబ్ధిదారుకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

- ఎమ్మెల్యే జోగారావు

బలిజిపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో ప్రతి ఇంటా పథకాల పంట పండుతోందని ఎమ్మెల్యే జోగారావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గడిచిన నాలుగేళ్ల కాలంలో అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకం అందిందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పథకాల అమలు ఏవిధంగా ఉందో తెలుసుకున్నారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక సమస్యలు, వ్యక్తిగతంగా పథకాలకు దూరమైనవారు ఉంటే వారినుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందుతున్నాయని, ఎవరి చుట్టూ తిరగకుండా పథకాలు అందిస్తున్న ప్రభుత్వం ఇదని చెప్పారు. పారదర్శకంగా పాలన చేయడం, ప్రజల సంక్షేమాన్ని కోరుకోవడం, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించడం సీఎం జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని తెలిపారు. ప్రజలు ఎటువంటి ఫలాలను పొందుతున్నారో గుర్తించి అటువంటి నాయకుడిని గెలిపించుకుని సీఎంగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ భానుమూర్తి, జెడ్పీటీసీ ఎ.రవికుమార్, మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, బలిజ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసరావు, జ్యోతీష్, రమణ, జి.సత్యంనాయుడు, వివిధ గ్రామాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

అమరజీవి విగ్రహావిష్కరణ

పార్వతీపురంటౌన్: పట్టణంలోని కొత్తవలస ప్రాంతంలో అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహాన్ని ఎమ్మెల్యే అలజంగి జోగారావు గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవలస ప్రాంతానికి చెందిన కళింగ వైశ్య సంఘం సభ్యులు గతంలో పొట్టి శ్రీరాములు విగ్రహం ఏర్పాటుకు స్థలం కావాలని విన్నవించగా మున్సిపల్ అధికారులకు చెప్పి విగ్రహ ఏర్పాటుకు అనువైన స్థలం చూపించగా, అనతి కాలంలోనే నూతన విగ్రహాన్ని ఏర్పాటు చేశారని అభినందించారు. నేడు విగ్రహాన్ని తాను ఆవిష్కరించడం చాలా సంతోషంగా ఉందన్నారు. విగ్రహాన్ని ఆవిష్కరించిన అనంతరం పాలాభిషేకం, పుష్పాభిషేకం చేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ బెలగాం జయబాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, ఏపీ స్టేట్ డైరెక్టర్ మెహర్‌ప్రసాద్, వార్డ్ కౌన్సిలర్‌లు జి.బాలమురళీకృష్ణ, ఆర్.చిన్ననాయుడు, కో ఆప్షన్ సభ్యులు మేరువ వెంకట్రావు, విగ్రహదాత తూముల ప్రభాకర్ రావు సుగుణ దంపతులు, సంఘం అధ్యక్షుడు పెద్దిన ధర్మారావు, కార్యదర్శి గెంబలి శ్రీనివాసరావు, కోశాధికారి గెంబలి నారాయణరావు, గౌరవాధ్యక్షుడు నారాయణ శెట్టి రమేష్, కార్యవర్గ సభ్యులు, బేగం ప్రాంతం కళింగ వైశ్య సంఘం అధ్యక్షులు ఉపాధ్యక్షులు, సభ్యులు స్థానిక ప్రజలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

అంగన్వాడీ సమస్యల పరిష్కారానికి కృషి



ఎమ్మెల్యే జోగారావుకు వినతిపత్రం అందజేస్తున్న అంగన్వాడీ కార్యకర్తలు

పార్వతీపురంటౌన్: అంగన్వాడీ టీచర్లు, హెలర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే అలజంగి జోగారావు హామీ ఇచ్చారు. ఈ మేరకు గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను అంగన్‌వాడీ సిబ్బంది కలిసి వారి సర్వీసులో గల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారాన్ని కోరుతూ వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి



గృహ నిర్మాణాల పరిస్థితిపై సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీఓ హేమలత

పార్వతీపురం: జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆర్డీఓ కె. హేమలత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం మండలంలోని కృష్ణపల్లిలో జగనన్న గృహ నిర్మాణాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాస్థాయి గృహప్రవేశాల కార్యక్రమాన్ని కృష్ణపల్లిలో ఏర్పాటు చేయాలని జిల్లా యంత్రాంగం నిర్ణయించిందని చెప్పారు. గృహప్రవేశాల కార్యక్రమం నాటికి ఎక్కువ సంఖ్యలో నిర్మాణాలు పూర్తి చేయాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారన్నారు. ఈ మేరకు గృహ నిర్మాణాల పనులను వేగవంతం చేసి పూర్తి చేయాలని కోరారు. పరిశీలనలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐరన్ మాత్రల పంపిణీ



విద్యార్థులకు ఐరన్ మాత్రలు వేస్తున్న ఆశ వర్కర్లు

మక్కువ: శంబర, మక్కువ పీహెచ్‌సీ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం విద్యార్థులకు ఐరన్ మాత్రలను పంపిణీ చేశారు. విద్యార్థుల్లో రక్తహీనతను నివారించడానికి మాత్రలు పంపిణీ చేసినట్లు ఆశా వర్కర్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు విష్ణు, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు సర్వే

గుమ్మలక్ష్మీపురం: ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని పాలకొండ సబ్ కలెక్టర్ నూరల్ కమర్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బీఎల్వోలతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ముందుగా ఇప్పటి వరకు చేపట్టిన ఓటరు సర్వే ప్రగతిపై ఆరా తీసారు. ఓటర్ల జాబితాలో తప్పు లు, మరణించిన వారి పేర్లు, ఒకే ఇంటి నంబర్‌పై ఎక్కువ ఓట్లు ఉంటే వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించి తేడాలు గమనించినట్లయితే తొలగించాలని ఆదేశించారు. కొత్త ఓటర్లుంటే చేర్చుకోవాలని, ఈ ప్రక్రియను ఈ నెల 21వ తేదీలోగా పూర్తి చేసి, ఆన్‌లైన్లో పొందుపర్చాలని సూచనలు చేశారు. సమావేశంలో తహసీల్దార్ జె.రాములమ్మ, ఉప తహసీల్దార్ రాజేంద్ర పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించాలి



విద్యార్థులను ప్రశ్నిస్తున్న ఎంఈఓ సామల

బలిజిపేట: కస్తూరిబా పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులకు మంచి నాణ్యమైన విద్యను అందించాలని ఎంఈఓ సామల సింహాచలం సూచించారు. ఈ మేరకు బలిజిపేట మండలంలోని వంతరాం కేజీబీవీని ఆయన గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతుల్లో విద్యాబోధన గమనించారు, విద్యార్థులకు అయిన సిలబస్‌పై ప్రశ్నించారు. ప్రోగ్రెస్ కార్డులు, రికార్డులను పరిశీలించారు. ఇంటర్‌మీడియట్‌లో కంప్యూటర్ కోర్సుకు బోధకులు లేరనే విషయాన్ని పాఠశాల ఎస్ఓ మధురవాణి తెలపగా ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేస్తానని చెప్పారు. నాడు-నేడు అదనపు తరగతి గదుల నిర్మాణాలను పరిశీలించి త్వరగా పూర్తిచేయించాలని సూచించారు. విద్యార్థినుల క్రమశిక్షణ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి సాగు బాట పట్టాలి



ప్రకృతి వ్యవసాయ సాగుపై సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం మండలాన్ని ప్రకృతి వ్యవసాయ పద్ధతుల సాగులో ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నందున ప్రతీ రైతును ప్రకృతి సాగు బాట పట్టించేందుకు కృషి చేయాలని డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్‌కుమార్ అన్నారు. ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం పి.షన్ముఖరాజు గుమ్మలక్ష్మీపురం వైటీసీలో గ్రామ సమాఖ్య వీఓఏలకు, ప్రకృతి వ్యవసాయం ఐసీఆర్‌పీలకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న డీఆర్‌డీఏ పీడీ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం చేయడం వలన తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చని, తద్వారా ఆరోగ్యకరమైన పంటల దిగుబడిని పొందడమే కాకుండా ఆదాయం కూడా పుష్కలంగా లభిస్తుందని, ఈ విషయాలపై గ్రామాల్లో సన్న, చిన్నకారు రైతులను గుర్తించి, అవగాహన కల్పిస్తూ, వారిని ప్రకృతి సాగు వైపు మళ్లించి, శతశాతం ప్రకృతి వ్యవసాయ మండలంగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం అదనపు ప్రబంధకులు ధనుంజయ వివిధ పంటల నమూనాలు, వాటి ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ సలహా మండలి చైర్మన్ అద్దాకుల చిన్నారావు, జట్టు వ్యవస్థాపకుడు డి.పారినాయుడు, ఎంఎంటీలు జి.నిర్మలాదేవి, నరసింహ పాల్గొన్నారు.

సామాజిక దస్త్రాలు సిద్ధం చేయాలి



సూచనలు ఇస్తున్న స్టేట్ రిసోర్స్ పర్సన్ గోవిందరావు

బలిజిపేట: 2022–23ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నిర్వహించనున్న సామాజిక తనిఖీ బృందానికి దస్త్రాలు సిద్ధం చేసి అందించాలని స్టేట్ రిసోర్స్ పర్సన్ గోవిందరావు తెలిపారు. ఈ మేరకు బలిజిపేటలోని ఉపాధిహామీ పథకం కార్యాలయం వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లతో గురువారం సమావేశం నిర్వహించారు. సామాజిక తనిఖీ బృందం ఈనెలాఖరు వరకు గ్రామాల్లో పర్యటించి రికార్డుల ప్రకారం నమోదైన పనులవి వరాలను సేకరిస్తుందని చెప్పారు. చేసిన పనులకు సంబంధించి అన్ని రికార్డులు తప్పనిసరిగా వారికి అందించాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లు జరిగినా బాధ్యులవుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏపీఓ కేశవరావు, ఏపీఎం ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్థిక నిర్వహణపై శిక్షణ



వెలుగు కార్యాలయంలో శిక్షణ పొందుతున్న వీఓఏలు

బలిజిపేట: పొదుపు సంఘాల ఆర్థిక నిర్వహణపై వీఓఏలు పర్యవేక్షణ చేసి సంఘాలను బలోపేతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా లీగల్ అడ్వయిజర్ రాజా తెలిపారు. ఈ మేరకు వెలుగు శిక్షణ కార్యాలయంలో బలిజిపేట మండల వీఓఏలకు శిక్షణ కార్యక్రమం గురువారం నిర్వహించారు. గ్రామ సంఘాలు ఏవిధంగా పుస్తకాలు నిర్వహించాలి? వారి పొదుపులకు సంబంధించి ఏవిధంగా చెల్లించాలి? ఆర్థిక లావాదేవీలు ఎలా చేస్తున్నారు? సంఘాల ఆదాయ, వ్యయాల వివరాలు, సంఘాలు లాభాల్లో ఉన్నాయా? లేదా? అనేది గమనించి వాటిని బలోపేతం చేసే విధానంపై వారిని కార్యోన్ముఖులను చేయడం, వెనుకబడిన సంఘాలను ఎలా ముందుకు తీసుకురావాలి, పొదుపులు సక్రమంగా చేస్తున్నదీ లేనిదీ గమనించడం వీఓఏలు సక్రమంగా చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఎం ఉమామహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధిలో భాగస్వాములు కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్

పార్వతీపురంటౌన్: పార్వతీపురం అభివృద్ధి కోసం పరిశ్రమల ఏర్పాటులో భాగస్వాములు కావాలని ఏపీ టిడ్కోచైర్మన్ జమ్మాన ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం ఆయన పట్టణంలోని దుర్గాదేవి ఆలయ ప్రాంతంలో ఉన్న టింబర్ డిపో యజమానులు, కార్పెంటరీ వృత్తుల వారి జీవన స్థితిగతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేస్తున్న వృత్తిలో నైపుణ్యం పెంచుకుని ప్రత్యేక గుర్తింపు పొందాలని సూచించారు. రాష్ట్రంలోని కృష్ణా జిల్లాలో కొండపల్లి, విశాఖ జిల్లాలో ఏటికొప్పాక, బొబ్బిలి ప్రాంతంలో వీణలు ప్రత్యేక గుర్తింపు పొందిన విధంగా ఈ ప్రాంతంలో కూడా నేటి అవసరాలకు అనుగుణంగా గృహోపయోగ పరికరాలు, ఆటబొమ్మల తయారీకి ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. చేతి వృత్తుల వారికి పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రత్యేక రాయితీలను ఇచ్చి ఆర్థికంగా సహకరిస్తుందని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టింబర్ వ్యాపారస్తులు, వడ్రంగి కళాకారులు, స్థానికులు పాల్గొన్నారు.